

పెద్దకర్మ

స్వస్తిశ్రీ శోభకృత్ నామ సం॥ర మార్గశిర బ॥ త్రయోదశి
తేది. 09-01-2024 మంగళవారం రోజున
మా తండ్రి గారైన

**శ్రీ రామ శ్రీనివాస్ గారు**

శివైక్యం పొందినారని తెలుపుటకు చింతించుచున్నాము.
తేది. 21-01-2024 ఆదివారం రోజున ఉదయం 9-00 గం॥లకు
పెద్దకర్మ, పుణ్యాహవాచనం, పిండప్రదానం, ఆశీర్వచనము
జరుపబడును. కావున మీరందరు వచ్చి మా తండ్రి గారి
ఆత్మకు శాంతి చేకూర్చగలరని కోరుచున్నాము.

ఇట్లు
కుమారుడు : రామ శైలేష్
భార్య : రామ శోభారాణి
కూతురు-అల్లుడు : నిమ్మగడ్డ స్వాతి-మహేష్

కార్యస్థలము : సిల్వర్ క్రౌన్ హైస్కూల్, బెస్తం చెరువు, తిమ్మపూర్ హవేలి, వరంగల్ - ఖమ్మం హైవే, వరంగల్.

సహపంక్తి భోజనము: మధ్యాహ్నం 1-00 గంటలకు.



# వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 183 | శనివారం | 20 జనవరి 2024 | పేజీలు : 08 | వెల రూ. 5




## ఆర్నెళ్లుగా.. జీతాల్లేవ్



- ఆగమవుతున్న ఆరోగ్య మిత్రలు
- కుటుంబాన్ని సాకలేక ఇబ్బందులు
- పట్టించుకోని ఆరోగ్య శ్రీ మిషన్
- ఆదుకోవాలంటున్న ఉద్యోగులు

కార్పొరేట్ ఆస్పత్రులకు, ప్రజలకు మధ్య వారధులుగా పనిచేస్తున్న ఆరోగ్య మిత్రల బతుకులు ఆగమవుతున్నాయి. ఆరు నెలలుగా జీతాలు రాకపోవడంతో కుటుంబాలను సాకలేక ఇబ్బందులు పడుతున్నారు. ఆరోగ్య శ్రీ మిషన్ ద్వారా వేతనాలు చెల్లించాల్సి ఉన్నప్పటికీ పట్టించుకునే వారు కరువయ్యారని వాపోతున్నారు. అరకొర వేతనాలకే ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సుమారు 110మందికి పైగా పనిచేస్తున్న ఆరోగ్య మిత్రలకు ప్రతీ నెలా చెల్లింపులు లేక పోవడంతో కుటుంబాలు బజారున పడే పరిస్థితి నెలకొందంటున్నారు. కనీసం సంక్రాంతి పండుగకైనా వేతనాలు అందుతాయని ఆశ పడిన వారికి నిరాశే మిగిలిందని నిట్టూరుస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ప్రతి నెల వేతనాలు చెల్లించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

వివరాలు 2లో..

- వరంగల్ వాయిస్, మల్హర్/భూపాలపల్లి

## గులాబీ సైనికుడు..



7లో..

- వరంగల్ ఎంపీ బరిలో తొర్రూరు జడ్పీటీసీ శ్రీనివాస్
- అభివృద్ధిలో తనదైన ముద్ర..
- ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరు..
- తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర
- ఉద్యమ నేతగా ఉమ్మడి వరంగల్‌కు సుపరిచితం..
- మచ్చలేని నాయకుడిగా గుర్తింపు..
- అధిష్ఠానం పరిశీలనలో మంగళపల్లి పేరు..?



8లో..

## ఒక్క గజం ప్రభుత్వ భూమిని వదలం

- ఎవరు ఆక్రమించినా వెనక్కి తీసుకుంటాం
- మేడారం జాతరకు రూ.110 కోట్లు..
- త్వరలో కాళోజీ క్షేత్రం పూర్తి..
- జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి







వరంగల్ వాయిస్ Evening Daily
శనివారం 20, జనవరి 2024
www.warangalvoice.net

# ఆర్నెళ్లుగా.. జీతాల్లేవ్

**ఆగమవుతున్న ఆరోగ్య మిత్రలు**
**కుటుంబాన్ని సాకలేక ఇబ్బందులు**
**పట్టించుకోని ఆరోగ్య శ్రీ మిషన్**
**ఆదుకోవాలంటున్న ఉద్యోగులు**








**వరంగల్ వాయిస్, మల్హర్/భూపాలపల్లి :** ఆరోగ్యశ్రీ ద్వారా ప్రజలకు ఉచితంగా వైద్య సేవలను అందించడంలో ఆరోగ్య మిత్రలు ప్రధాన భూమిక పోషిస్తున్నారు. తమ వద్దకు వచ్చిన రోగులకు మానసిక ధైర్యం కల్పించి వారికి చికిత్స అందించడంలో ఆరోగ్య మిత్రలు సేవలు అందిస్తున్నారు. పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించడంలో ఆరోగ్య మిత్రల పాత్ర వెలకట్టలేనిది. ఇప్పటికే చాలీ చాలనీ వేతనాలతో కాలం గడుపుతున్న ఆరోగ్య మిత్రలకు గత ఆరు నెలలుగా వేతనాలు అందక పోవడంతో వారి కుటుంబాలు బజారున పడే పరిస్థితి నెలకొంది. తినేందుకు తిండి లేక, పిల్లల స్కూల్ ఫీజు కట్టలేక సతమతమవుతున్నారు.

### వేతనంలేక ఇబ్బందులు..

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న ఆరోగ్యమిత్రలకు గత ఆరు నెలలుగా జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ఏడాది జులై మాసంలో జీతాలు అందుకున్న ఆరోగ్య మిత్రలకు ఇప్పటి వరకు జీతాలు లేవు. జీతాలు లేక పండుగ పూట పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందంటున్నారు. సగటు వేతన జీవికి ఒక నెల వేతనం రాకుంటేనే ఇబ్బంది పడుతున్న ఈ రోజుల్లో ఆరు నెలల నుంచి జీతాలు రాకుంటే కుటుంబాన్ని ఏ విధంగా పోషిస్తామని ఆరోగ్య మిత్రలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ అధికారులు కూడా జీతాల గురించి పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు.

### ముగిసిన ఏజెన్సీ కాలపరిమితి..

గత ఏడాది ఆరోగ్య మిత్రలకు జీతాలు చెల్లించే ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ కాలపరిమితి ముగియడంతో గత కొద్ది రోజుల క్రితమే మరో ఏజెన్సీకి జీతాల చెల్లింపు బాధ్యతలు అప్పగించారు. కొత్త ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించడంతో జనవరి నెలలోనైనా జీతం వస్తుందనుకున్న ఆరోగ్య మిత్రులకు మరోసారి నిరాశే ఎదురయ్యే పరిస్థితి కనబడుతోందంటున్నారు. దసరా నుంచి మొన్నటి సంక్రాంతి వరకు పండుగ పూట అప్పులు చేస్తూ కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు ఆరోగ్య మిత్రలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్యశ్రీలో పనిచేసే పై స్థాయి అధికారులు నెలనెలా జీతాలు పొందుతూ సిబ్బందిని మాత్రం పటించుకోవడంలేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత్యంతరం లేని పరిస్థితుల్లో జీతాల కోసం ఆరోగ్యమిత్రలు స్థానిక ప్రజాప్రతినిధులను కలవడం తోపాటు విధుల బహిష్కరణకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి జీతాలు చెల్లించి తమ కుటుంబాలని ఆదుకోవాలని ఆరోగ్యమిత్రలు కోరుతున్నారు. అదేవిధంగా ఆరోగ్య మిత్రలకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత అందని ద్రాక్షగానే మిగిలిందంటున్నారు.

### ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులదీ అదే పరిస్థితి..:

**- రామ రాజేష్ ఖన్నా,**



**నేషనల్ హెల్త్ మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**

నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్ హెచ్ ఎం) లో పనిచేస్తున్న ఉద్యోగులందరిదీ ఇదే పరిస్థితి అని నేషనల్ హెల్త్ మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా ఆవేదన వ్యక్తం చేశారు. రెండు నెలలుగా వారికి జీతాల చెల్లింపులు నిలిచిపోయాయన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018 సంవత్సరంలో జీవో నెంబర్ 510 విడుదల చేసి కొంతమంది నేషనల్ హెల్త్ మిషన్ లో పనిచేస్తున్న ఉద్యోగులకు వేతనాలు పెంచారని, మిగతా 4500 మందికి పైగా ఉద్యోగులకు వేతనాలు పెంచలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నేషనల్ హెల్త్ మిషన్ స్కీంలో ఎన్నో ఏళ్లుగా పనిచేయుచున్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పబ్లిక్ హెల్త్ మేనేజర్, అకౌంటెంట్, సపోర్టింగ్ స్టాఫ్ మెడికల్ అసిస్టెంట్, స్వీపర్, వాచ్ మెన్, బ్లాక్ లెవెల్ అకౌంటెంట్ అకౌంటెంట్, ప్రైమరీ హెల్త్ సెంటర్ డేటా ఎంట్రీ ఆపరేటర్ అండ్ ఎస్ ఎన్ సీయూ డేటా ఎంట్రీ ఆపరేటర్లు, బస్తి దవాఖాన సపోర్టింగ్ స్టాఫ్, ఎన్ సీడీ కౌన్సలర్స్, అర్ కేఎస్ కే కౌన్సలర్స్, న్యూట్రిషన్ కౌన్సలర్స్, డెంటల్ టెక్నీషియన్, ఫీజియోథెరపిస్ట్, సోషల్ వర్కర్, ఎంసీహెచ్ సెక్యూరిటీ గార్డ్స్, పీహెచ్ సీ కాంటిజెంటీ వర్కర్లకు బ్లడ్ బ్యాంకు డ్రైవర్స్ కు గత అనేక సంవత్సరాలుగా తీవ్ర అన్యాయం జరుగుతున్నదని విమర్శించారు. సిబ్బంది జీతాల పెంపుదల కోసం గతంలో అనేక పర్యాయాలు కమిషనర్ కు వివరించినా సమస్య పరిష్కరించకపోవడం అన్యాయమన్నారు. వెంటనే వీరి జీతాలు పెంచుతూ తగు నిర్ణయం తీసుకోవాలన్నారు. లేకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఇందులో భాగంగా మార్చి రెండో వారంలో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన ఈనెల 21 ఆదివారం ఉదయం 11 గంటలకు హనుమకొండ జిల్లా హరిత హోటల్ లో నిర్వహించనున్న సమావేశానికి నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

# క్రీడలతో మానసికోల్లాసం

## ప్రిన్సిపాల్ ఎస్ ధర్మేంద్ర



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** క్రీడలు మానసికొల్లాసాన్ని కలిగిస్తాయని హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ ధర్మేంద్ర అన్నారు. శనివారం జనవరి 26న గణతంత్ర దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా కళాశాలలో విద్యార్థులకు పలు రకాల క్రీడల్లో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని అన్నారు. మానసిక ఒత్తిడి లేకుండా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు మాధవి, తెలంగాణ రాష్ట్ర జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ అసోసియేట్ ప్రెసిడెంట్ ఇ.శ్రీనివాస్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ముగ్గుల వెలుగులో అయోధ్య సీతా రాముల చిత్రం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఈనెల 22న నరేంద్ర మోడీ తలపెట్టిన అయోధ్య బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా ప్రతి ఇంటిలో ఐదు దీపాలను వెలిగించాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా వరంగల్ నగరంలో గల 42వ డివిజన్ రంగసాయిపేట గంగపుత్ర వీధిలో ఇంటి ముందు సాయంత్రం ముగ్గుల వెలుగులో అయోధ్య సీతా రాముల చిత్రాన్ని తత్తరి మంజు భార్గవి, జిజుల సరోజన కుటుంబ సభ్యులు కలిసి ముగ్గు రూపంలో ఇంటి ముందు వేసి, ఐదు దీపాలను వెలిగించి జైశ్రీరామ్ జై జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు.

# శ్రీరాముడి శోభాయాత్ర గోడ పత్రిక ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** అయోధ్యలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం పురస్కరించుకొని గోవిందరాజస్వామి దేవాలయ ప్రధాన అర్చకుడు శ్రీ వరయోగుల శ్రీనివాస స్వామి ఆధ్వర్యంలో వరయోగుల లక్ష్మణస్వామి, వరయోగుల క్రాంతి కుమార్ స్వామి, వరయోగుల కృష్ణమూర్తి స్వామిలతో పాటు స్థానిక శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయ అభివృద్ధి ప్రదాత మరిపెల్లి సంజీవరావు 22న నిర్వహించే శ్రీరాముడి శోభాయాత్ర గోడ పత్రికను శనివారం ఆవిష్కరించారు. భక్తులు రాపాక ఉపేందర్, బండా శ్రీనివాస్, పూర్ణచంద్ర చౌదరి, బందెల శ్రీనివాస్ లతో పాటు పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. 22న సోమవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ఈ శోభాయాత్ర గోవిందరాజస్వామి ఉత్సవ మూర్తి ఆలయం నుంచి ప్రారంభమై స్టేషన్ రోడ్డు మీదుగా హెడ్ పోస్ట్ ఆఫీస్, ఆకారపు గుడి, వరంగల్ చౌరస్తా మీదుగా జేపీ రోడ్, దుర్గేశ్వర స్వామి గుడి మీదుగా పిన్నవారి స్ట్రీట్ నుంచి ఎల్లం బజార్ మీదుగా లక్ష్మీ టాకీస్ నుంచి రాముల వారి వీధి, కొత్త బుద్రా మీదుగా తిరిగి శ్రీ గోవిందరాజ స్వామి వారి ఉత్సవ మూర్తి ఆలయానికి విచ్చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమం అనంతరం శ్రీ గోవిందరాజ స్వామి ఉత్సవమూర్తుల ఆలయంలో, గోవిందాద్రి గోశాలలో అఖండ రామ జ్యోతి ప్రజ్వలన, అఖండ దీపోత్సవం కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించుటకు ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. కాబట్టి వరంగల్ నగర ప్రజలు ఈ కార్యక్రమానికి అత్యధిక సంఖ్యలో విచ్చేసి శతాబ్దాల రామకల సహకారం అవుతున్న ఈ శుభ తరుణంలో ప్రతి ఒక్క భక్తుడు ఈ శోభాయాత్రలో పాల్గొనాలని కోరారు.

# ఓటరు నమోదుకు మరో అవకాశం

**శని, ఆది వారాల్లో అందుబాటులో బీఎల్ ఓలు**

**జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల జాబితా సవరణలో భాగంగా శనివారం వర్ధన్నపేట నియోజకవర్గంలోని హసన్ పర్తి మండలం గోపాలపురం జవహర్ కాలనీ పోలింగ్ కేంద్రాన్నీ అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాఖేడేతో కలసి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆకస్మికంగా సందర్శించి ఓటర్ల నమోదు రిజిస్టర్లను పరిశీలించారు. ముందుగా స్పెషల్ క్యాంపెయిన్ డే ఓటర్ జాబితాను పరిశీలించి బూత్ లెవెల్ అధికారుల పనితీరును పర్యవేక్షించారు. బీఎల్ఓ యాప్ ను పరిశీలించి ఫారం 6, 7, 8 జనరేట్, అప్డేట్ ను, బీఎల్ ఓల, హౌస్ టు హౌస్ సర్వే రిజిస్టర్ లను తనిఖీ చేశారు. పటిష్టమైన ఓటర్ జాబితా తయారీకి కావలసిన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటర్ నమోదుపై స్పెషల్ క్యాంపెయినింగ్ లో అర్హత కలిగిన వారు నూతన ఓటురుగా నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలని, ఓటర్ కార్డులో మార్పులు చేర్పులకు సైతం అవకాశం కలదన్నారు. శనివారం, ఆదివారం జిల్లా వ్యాప్తంగా 791 పోలింగ్ కేంద్రాల్లో బీఎల్ఓ లు అందుబాటులో ఉంటారని కలెక్టర్ తెలియజేశారు.

# రేపు నిట్ వరంగల్‌లో ఎస్ఆర్ఎఫ్ లెవెల్ టు పరీక్ష




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రముఖ ప్రఖ్యాత విశ్వ మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని ఎస్ఆర్ఎఫ్ ఆధ్వర్యంలో శ్రీనివాస రామానుజన్ మ్యాథమెటిక్స్ ఒలంపియాడ్, సీవీ రామన్ సైన్స్ ఒలంపియాడులను లెవెల్ వన్ ను నిర్వహించి అందులో అర్హత సాధించిన విద్యార్థులకు లెవెల్ టు పరీక్ష ఆదివారం మధ్యాహ్నం నిట్ వరంగల్ క్యాంపస్ లో నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు తుమ్మ అమరేష్ శనివారం తెలిపారు. హాల్ టికెట్స్ ఉన్న విద్యార్థులను మాత్రమే మెయిన్ గేట్ వద్ద నుంచి నిట్ లోపలికి అనుమతింపబడునని పేర్కొన్నారు. వాహనాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు నిట్ లోపలికి ఎంట్రీ ఉండదని తెలిపారు. ఈ పరీక్ష విజయవంతం చేసేందుకు అందరూ సహకరించాలని కోరారు.

# అభివృద్ధి పనులపై అధికారులకు వినతి



**వరంగల్ వాయిస్, వరకాల :** మండలంలోని మల్లక్కపేట గ్రామంలో పంచాయతీ కార్యదర్శి ఒరుగంటి శైలజ, మల్లక్కపేట గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్థుల సమక్షంలో నిర్వహించిన గ్రామ సభలో గ్రామంలోని సమస్యలు నూతన డ్రైనేజీ, రోడ్డు మరమ్మత్తులు లింక్ రోడ్లు, పలు అభివృద్ధి పనులపై వినతిపత్రాన్ని గ్రామ అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మామునూరి రాజు, మాజీ సర్పంచ్ అల్లం రఘునారాయణ, 8వ వార్డు మెంబర్ దొమ్మటి శ్రీను, 10వ వార్డు మెంబర్ దొమ్మటి మల్లయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొమ్మటి కృష్ణకాంత్, గురిజాల రాజేందర్, అంబిరు శ్రీనివాస్, అల్లం శ్రీరామ్, దొమ్మటి మధు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# గద్ద కొమురయ్యకు జీఎంపీఎస్ నాయకుల నివాళి



**వరంగల్ వాయిస్, రఘునాథ్‌పల్లి :** మండలంలోని అశ్వారావుపల్లి గ్రామానికి చెందిన గద్ద రాజు గొర్రెల మేకల పెంపకందారుల సంఘం(జీఎంపీఎస్) మండల కార్యదర్శి తండ్రి గద్ద కొమురయ్య (80)మృతిచెందారు. విషయం తెలుసుకున్న జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు మోటే దేవేందర్, జిల్లా కార్యదర్శి సాదం రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు, మండల అధ్యక్షులు గుండ వెంకటయ్య, మాయ రాములు, మృతదేహం వద్ద పూలమాల ఉంచి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పెద్దగోళ్ల దండిగా పెద్ద రాములు, చారిగొల్ల గాజుల మల్లయ్య, దండిగా కుమార్, గాజుల రామయ్య, మంద బుచ్చయ్య, గద్ద లక్ష్మయ్య, గద్ద చిన్న కొమురయ్య, ఇస్సిల్ల స్వామి, ఇస్సిల్ల వెంకటయ్య, గొర్ల రాజయ్య, మంద రాజు, తదితరులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ వర్ధన్నపేట నియోజకవర్గం 14వ డివిజన్ సుందరయ్య నగర్ లో గత ఐదు రోజుల క్రిందట సీనియర్ ఆటో నాయకుడు మరిగిద్దె రాములు మృతి చెందారు. శనివారం మార్కెట్ ఆటో యూనియన్ అధ్యక్షుడు దుంపేటి శ్రీను, మాజీ ఆటో యూనియన్ అధ్యక్షుడు అదుప మహేష్, ఆటో డ్రైవర్లు వారి నివాసానికి వెళ్లి పదివేల రూపాయలు ఆర్థిక సాయం చేశారు. ఉపాధ్యక్షుడు హనుమకొండ కుమార్, కోశాధికారి యనమందల కృష్ణ, సహాయ కార్యదర్శి నీడిగొండ శ్యామ్, సహాయ ఉపాధ్యక్షుడు ఆకుల శ్రీధర్, కన్నా పాషా తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి పద్మశాలి కులస్తుల చేయూత

## అంత్యక్రియలకు ఆర్థిక సాయం
## సొంతిల్లు లేక శ్మశాన వాటిక దగ్గరనే మృతదేహం



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** మండల కేంద్రానికి చెందిన గాజుల రాజేందర్ (50) శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. నిరుపేద కుటుంబానికి చెందిన రాజేందర్ గత 30ఏళ్లుగా అద్దె ఇంట్లో ఉంటూ స్థానిక మార్కెట్ వద్ద టీ కొట్టు పెట్టుకుని జీవనం కొనసాగిస్తున్నారు. సొంత ఇల్లు లేక పోవటంతో అతడి మృత దేహాన్ని స్థానిక శ్మశాన వాటిక ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఉంచి కుటుంబ సభ్యులు, బంధువులు చందాలు వేసుకుని అంత్య క్రియలు నిర్వహించారు. కుటుంబం పెద్దదిక్కు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుగా విలపించగా, పద్మశాలి కుల సంఘం సభ్యులు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం కులస్తులు రూ.11వేల ఆర్థిక సాయం చేశారు. మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు బొప్ప శివశంకర్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన రాజేందర్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని, నిలువ నీడ లేక అంత్యక్రియలకు కూడా ఇబ్బందులు కలుగుతున్నాయని, ప్రభుత్వం ఇలాంటి నిరుపేదలకు ముందుగా ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. అలాగే పద్మశాలి కులస్తులు రాజేందర్ కుటుంబానికి తోచిన సాయంతో ఆదుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమలాపూర్ పట్టణ శాఖ అధ్యక్షుడు బైరి దశరథం, ప్రధాన కార్యదర్శి పులికంటి రాజేందర్, కులస్తులు తుమ్మ రాజు, బైరి సహదేవ్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలిగా కందగట్ల హరిత



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని 42వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా కందగట్ల హరితను కొండా దంపతుల ఆదేశాల మేరకు నియమించినట్లు వరంగల్ నగర కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు నారగోని స్వప్న-మురళి గౌడ్ తెలిపారు. ఈ మేరకు శనివారం నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. ఎన్నికల సమయంలో కందగట్ల హరిత కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలోని ఆరు సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయటంలో విశేష కృషి చేశారని, ఆమె సేవలను గుర్తించిన కొండా దంపతుల ఆదేశాల మేరకు ఈ బాధ్యతలను అప్పగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన హరిత మాట్లాడుతూ నాపై నమ్మకంతో నాకు ఈ బృహత్తరమైన బాధ్యతలను అప్పగించేందుకు కృషిచేసిన కొండా దంపతుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. నాకు ఈ బాధ్యత వచ్చేందుకు సహకరించిన నారగోని స్వప్న-మురళి గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇటీకాల అశోక్, పూసల కిరణ్, ఎలుగు వీరస్వామిలకు హరిత శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా నియమితులైన హరితను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు శాలువాతో ఘనంగా సత్కరించారు. కాంగ్రెస్ పార్టీలో జెండా మోసిన ప్రతి ఒక్కరికి గుర్తింపు లభిస్తుందనడానికి హరితను ఉదాహరణగా తీసుకొని ప్రతి ఒక్క కార్యకర్త పార్టీ కోసం కష్టపడి పని చేయాలన్నారు.

# వీరమల్ల రంజిత్ రెడ్డికి రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవి.?

## దశాబ్ద కాలంగా కాంగ్రెస్ బలోపేతానికి కృషి
## అధిష్ఠానం ఆశీస్సులు మెండుగా ఉన్న నేత



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హుస్నాబాద్ నియోజకవర్గం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వీరమల్ల రంజిత్ రెడ్డికి రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవి రాబోతుందని విశ్వసనీయ వర్గాల సమాచారం. పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు పార్టీతో ఎవరూ లేనప్పుడు రంజిత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ఎదుగుదల కోసం తీవ్రంగా శ్రమించారు. 2015 నుంచి ఒక వైపు కాకతీయ విశ్వవిద్యాలయం వేదికగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో, వర్ధన్నపేట నియోజకవర్గంలో కూడా కాంగ్రెస్ పార్టీ కోసం నిరంతరం కష్టపడి వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, హుస్నాబాద్ నియోజకవర్గాల్లో పొన్నం ప్రభాకర్ తో పాటు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు గెలుపు కోసం తీవ్రంగా కృషి చేశారు. పైగా తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి పాదయాత్రలో, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో కూడా ముందు వరుసలో నిలబడ్డారు. గతంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. ఎల్కతుర్తి మండలంలోనే కాకుండా హనుమకొండ జిల్లాలోనే పలువురు కార్యకర్తలు వీరమల్ల రంజిత్ రెడ్డికి నామినేటెడ్ పదవి రావాలని కోరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అధిష్ఠానం ఆశీస్సులతో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు దీవెనలతో తనకు తప్పకుండా రాష్ట్ర స్థాయి పదవి వస్తుందని వీరమల్ల రంజిత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలి

## నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర నాయకుడు మేడారపు సుధాకర్



**వరంగల్ వాయిస్, పాలకుర్తి :** వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం పట్టభద్రులు ఓటు నమోదు చేసుకునే విధంగా పాలకుర్తి మండలంలోని ఊరూరా సర్పంచులు, అధికారుల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలంగాణ రక్షణ వేదిక, తెలంగాణ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర నాయకులు డాక్టర్ మేడారపు సుధాకర్ డిమాండ్ చేశారు. పట్టభద్రుడికి ఫారం 18 ఇవ్వాలని కోరుతూ మేడారపు సుధాకర్ ఆధ్వర్యంలో పాలకుర్తి మండల తహసీల్దార్ తీరందాసు వెంకటేశ్వర్లకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మేడారపు సుధాకర్, గిలకత్తుల సోమశేఖర్ గౌడ్ మాట్లాడుతూ గ్రాడ్యుయేట్, ఉద్యోగులు, నిరుద్యోగులు ఆన్ లైన్ లో అప్లై చేసిన అనంతరం వారిని తహసీల్దార్ కార్యాలయానికి డిగ్రీ ఒరిజినల్ సర్టిఫికెట్ తీసుకొని రమ్మంటున్నారని, పై చదువులు అవసరాల నిమిత్తం పట్టభద్రుల దగ్గర ఉండకపోవచ్చని, దానికి బదులు వేరే ఏదైనా గుర్తింపు కార్డును పరిగణలోకి తీసుకోవాలని కోరారు. ఓటు నమోదు అవగాహన కోసం ముఖ్య కూడలిలో ఫ్లెక్సీలు స్టాల్స్ ఏర్పాటు చేయాలని కోరారు. బూత్ లెవెల్ ఆఫీసర్లను గుర్తింపు కార్డులను వేరిఫై చేయడానికి గ్రామాల్లోకి పంపాలన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన తహసీల్దార్ తీరందాసు వెంకటేశ్వర్లు సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గిలకత్తుల సోమశేఖర్ గౌడ్, జలగం అశోక్, కమ్మగాని వెంకటేశ్వర్లు, కోడెం సాయిరాం, అరుణ్ సాయి పాల్గొన్నారు.

# క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయి

## జాగృతి జిల్లా అధ్యక్షుడు పోరిక రవీందర్



**వరంగల్ వాయిస్, ములుగు :** వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవిపేట గ్రామంలో మండల స్థాయి షటిల్ క్రీడలు నిర్వహించారు. విజేతలకు భారత జాగృతి ములుగు జిల్లా అధ్యక్షులు డా.పోరిక రవీందర్ బహుమతులు అందించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని, క్రీడల వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని అన్నారు. ప్రతి రోజు వ్యాయామం చేయడం వల్ల అనారోగ్యానికి గురి కాకుండా ఉండవచ్చున్నారు. నేడు దేశ, రాష్ట్ర స్థాయిలో ప్రముఖంగా ఉండే క్రీడాకారులు ఒకప్పుడు గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చినవారే అని అన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజం అని అన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చిర్ర మహేందర్, దర్శన్ లకు మొదటి బహుమతి రూ.5016, వినీల్, రాజేందర్ లకు ద్వితీయ బహుమతి రూ.3016, ఉత్తమ క్రీడాకారుడు సంతోష్ కు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ముక్కెర తిరుపతి, చిర్ర సిద్ధు, గంట రాజు, సంతోష్, లక్ష్మణ్,శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

## చిల్కోడు మోడల్ స్కూల్ హాస్టల్ ప్రారంభించాలి




**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** మండలంలోని చిల్కోడు మోడల్ స్కూల్ బాలికల వసతి గృహాన్ని వెంటనే ప్రారంభించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెలోత్ సాయి కుమార్, మండల ఇంఛార్జి గుగులోతు సూర్య ప్రకాష్ డిమాండ్ చేసారు. ఎస్ఎఫ్ఐ అధ్వర్యంలో వసతి గృహం ముందు ధర్నా నిర్వహించిన అనంతరం నాయకులు మాట్లాడారు. చిల్కోడు మోడల్ స్కూల్ బాలికల వసతి గృహం తెరవక ప్రతి రోజూ విద్యార్థినులు ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వసతి గృహంపై జిల్లా కలెక్టర్, డీఈఓకు పలుమార్లు వినతిపత్రం అందజేసిన ఫలితం లేదన్నారు. విద్యారంగ సమస్యలు అధికారులు చిన్న చూపు చూస్తురని, విద్యా సమస్యలు పరిష్కరించకపోతే భారీ ఉద్యమాలు తప్పవన్నారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమై అర్ధ సంవత్సరం గడుస్తున్న విద్యా రంగ సమస్యలు పరిష్కరించడంలో జిల్లా విద్యాధికారులు విఫలమయ్యారని ఆగ్రహించారు. ప్రభుత్వ అధికారులు స్పందించి వసతి గృహం ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వినయ్, సౌమ్య, నీహారిక విద్యార్థినులు పాల్గొన్నారు.

## క్యాలెండర్స్, డైరీ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బాలసముద్రంలోని సురక్ష ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ బ్రాంచ్ కార్యాలయంలో నూతన సంవత్సర 2024క్యాలెండర్స్, డైరీ ఆవిష్కరణ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించినట్లు సురక్ష ఇన్ఫ్రా ప్రాజెక్ట్ డైరెక్టర్స్ రాజారత్నం కొల్లూరి, మర్రి వెంకటేశ్వర్లు మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ కస్టమర్లకు మెరుగైన, నాణ్యమైన సేవలను అందించాలని సురక్ష ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ సీనియర్ మార్కెటింగ్ అసోసియేట్స్ కుటుంబ సభ్యులను కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మార్కెటింగ్ అసోసియేట్స్ సభ్యులు జి.గోపి, మహమూద్ అలీ, కే.ఆరోగ్యం, ఆర్డీ స్వామి, జి.వెంకటేష్, రాసకట్ల శ్రీనివాస్, డికెన్, సత్యనారాయణ,గిరీష్, నరేష్ యాదవ్, యాదగిరి, ప్రవీణ్, సహజా రెడ్డి, సుమలత, అడ్మిన్ స్టాఫ్ శరత్, సారిక సుజాత, శిరీష, దివ్య, సురక్ష ఇన్ఫ్రాప్రాజెక్ట్స్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మంత్రి సీతక్కను కలిసిన ఓపీఎస్‌లు



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కను రాష్ట్ర ఓపీఎస్ సంఘం సభ్యులు కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో 3000మంది ఔట్ సోర్సింగ్ పద్దతిలో పంచాయతీ కార్యదర్శులుగా పనిచేస్తున్నామని, అందులో 2000 మందిని మాత్రమే పర్మినెంట్ చేసి మిగతా 1000మందిని పర్మినెంట్ చేయలేదని, అదేవిధంగా 1000మందికి కూడా ఒక్కో జిల్లాలో ఒక్కో రకంగా జీతం అందుతుందని ఆ జీతం కూడా నెల నెలా రాక ఇబ్బందులు పడుతున్నామని ఓపీఎస్ లు సీతక్కకు విన్నవించుకున్నారు. ఓపీఎస్ లు ధర్నా చేపట్టిన సమయంలో కాంగ్రెస్ నేతలు మద్దతు తెలిపి అధికారంలోకి రాగానే న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, కమిషనర్ సందీప్ కుమార్ సుల్తానియా దృష్టికి తీసుకొని వెళ్లి ఆదుకోవాలని కోరారు. దీనిపై మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించి పరిష్కారమయ్యేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు ఓపీఎస్ సంఘం బాధ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఓపీఎస్ జిల్లా కమిటీ బాధ్యులు మాచర్ల సతీష్, రమేష్, రాకేష్, హేమంత్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

## కాషాయ ధ్వజాల వితరణకు శ్రీకారం



**వరంగల్ వాయిస్, పరకాల :** దేశ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు 21వ వార్డు కౌన్సిలర్ ఆర్పీ జయంత్ లాల్ తన వంతు రామకార్యంగా 21వ వార్డులో నివాసం ఉంటున్న ప్రతి ఇంటిపై కాషాయ జెండా ఎగరవేయాలని ఆలోచనతో ఇంటి ముందు దీపావళి జరుపుకోవాలనే ఉద్దేశంతో ప్రతి కుటుంబానికి ఒక ధ్వజంతో పాటు దీపావళి కాకర పుల్లలు వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కాషాయ ధ్వజాలను స్థానిక మలకపేటలోని భక్తాంజనేయ స్వామి ఆలయంలో ఆలయ అర్చకులు కాటూరి జగన్నాథచార్యులు, శరత్ కుమార్ ఆచార్యులు, రాఘవాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి వార్డు ప్రలందరూ శ్రీ రాముడి ఆశీస్సులతో సుభిక్షంగా సుఖ సంతోషాలతో నిండు నూరేళ్లు ఆరోగ్యంగా జీవించాలని శ్రీరాముడికి పూజలు చేసినట్లు తెలిపారు. 1116 ధ్వజాలు ఉచితంగా వార్డు ప్రజలతో పాటు పట్టణ ప్రజలకు వితరణ చేయునున్నట్లు ఆయనపేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మరాటి నరసింహారావు, వెలిశెట్టి రాజేష్, పాలకుర్తి తిరుపతి, మెండు రాజశేఖర్, సూర్య, రాహుల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అంధుల సేవ విశ్వమానవ సేవ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అంధ నిరుద్యోగుల సంఘం లూయి బ్రెయిలీ జయంతి ఉత్సవాలు హనుమకొండలోని గ్రంథాలయ సెమినార్ హాల్ లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ది.నేషనల్ కన్జుమర్ రైట్స్ కమిషన్ తెలంగాణ రాష్ట్ర వైస్ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి, వరంగల్ డీడబ్ల్యూఓ శారద వేడుకలో పాల్గొని అంధ పిల్లలకు ఆత్మీయ స్పర్శను అందించారు. డాక్టర్ అనితా రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి, అతిథులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కేక్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం బ్రెయిలీ క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతర డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ అంధులు చూపులేక పోయినా మనో నేత్రాలతో చూడగలరని, అత్యంత ప్రతిభ వీరికి ఉంటుందని, దానిని ప్రోత్సహించి మేమున్నామన్న ధైర్యం అందించాలన్నారు. అంధులతో చాలా సేపు సమయం గడిపి వారి సాదక బాదకాలు అడిగి తెలుసుకొని అమ్మలా ఆత్మీయ స్పర్శ అందించారు. అంధుల సేవ విశ్వమానవ సేవ అన్నారు. అంధులు అందివచ్చిన అవకాశాలు వినియోగించుకుని అభివృద్ధిలోకి రావాలని, ఎందరో అంధులు ఐఏఎస్ గా, ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్లాలన్నారు. డీడబ్ల్యూఓ శారద మాట్లాడుతూ ప్రభుత్వం అందించే ప్రతి వసతులు, స్కీమ్ లు వీరికి అందుబాటులో ఉంచుతామన్నారు. డాక్టర్ అనితా రెడ్డి, శారద, లక్షీకాంత రెడ్డి, డాక్టర్ వెంకట రాంరెడ్డి, నల్లెల రాజయ్య, సంఘం బాధ్యులు మహేందర్, వీరన్న, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణ మున్సిపాలిటీ పరిధిలో వివిధ కారణాలతో మరణించిన ఒంటేరు సారమ్మ, కోయిల సుమలత, మాదాసి భార్గవిల పార్థివ దేహాలకు కాంగ్రెస్ పార్టీ పరకాల పట్టణ కమిటీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఒంటేరు శ్రవణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మంద నాగరాజు, మాజీ ఎంపీపీ ఒంటేరు రామ్మూర్తి, జిల్లా సేవాదళ్ బొచ్చు చందర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొమ్మకంటి చంద్రమౌళి, సీనియర్ నాయకులు గోనాథ్, బొచ్చు కట్టయ్య, బొచ్చు బాబు, చంగల్, గూడెల్లి సదన్ కుమార్, ఒంటేరు రవికుమార్, గొట్టె రమేష్, బొచ్చు అనంత్, సంపత్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## ముస్త్యాలపల్లి దర్గాను దర్శించుకున్న ఎమ్మెల్యే రేవూరి



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని ముస్త్యాలపల్లి గ్రామంలోని దర్గా (ఉర్సు)ఉత్సవాలలో శనివారం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యేగా గెలిచి మొదటిసారిగా దర్గాకు వచ్చిన రేవూరి ప్రకాశ్ రెడ్డిని దర్గా పీఠాధిపతులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికి పుష్పగుచ్చాలు అందించి శాలువాలు కప్పి సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి దర్గాను దర్శించుకొని చాదర్ కప్పి పీఠాధిపతులతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా దర్గాను భక్తులు అధికసంఖ్యలో హాజరవడం సంతోషకరమని అన్నారు.

## అన్ని రంగాలపై అవగాహన కలిగి ఉండాలి




**వరంగల్ వాయిస్, నర్సంపేట :** నెహ్రూ యువ కేంద్రం నర్సంపేట వారి అధ్వర్యంలో ఆర్టీఐ, ఆధునిక సేంద్రీయ వ్యవసాయం, నైపుణ్య అభివృద్ధి శిక్షణా అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జనవరి 12 నుంచి 20వరకు నేషనల్ యూత్ వీక్ ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుంది. అందులో భాగంగా శనివారం నర్సంపేటలోని ఎస్ఆర్ కళాశాలలో ఆర్టీఐ, ఆధునిక సేంద్రీయ వ్యవసాయం, నైపుణ్య అభివృద్ధి శిక్షణా అవకాశాలపై సెమినార్ నిర్వహించినట్లు ఎన్ వైకేఎస్ నర్సంపేట యూత్ వలంటీర్ పురుషోత్తం తెలిపారు. యువత చదువుతో పాటు సామాజిక అంశాల పైన, చట్టాల పైన, అన్ని రంగాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. నేటి యువత నే రేపటి భారత భవిష్యత్ కాబట్టి చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా సామాజిక స్పృహతో మెలగాలని పిలుపునిచ్చారు.

## అర్హులు ఓటు హక్కును పొందాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఓటర్ నమోదు తప్పుల సవరణ, అడ్రస్ మార్పుల కోసం తెలంగాణ ఎన్నికల అధికారి కల్పించిన అవకాశాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. జనవరి 20, 21న డివిజన్ లోని ఆయా ప్రాంతాలకు సంబంధించిన పోలింగ్ స్టేషన్ లో బూతుల వారీగా 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులకు ఓటర్ గా నమోదు చేసుకోవడానికి, గతంలో ఇచ్చిన గుర్తింపు కార్డులలో తప్పులు ఉన్న వారు సరి చేసుకోవడానికి, అడ్రస్ లు మార్పు ఉన్నట్లయితే ప్రస్తుత అడ్రస్ నమోదు చేసుకోవడానికి రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రతి పోలింగ్ స్టేషన్ లో బీఎల్ఓలను ఉంచాలన్నారు. వారి వద్ద ఉచితంగా అప్లికేషన్ ఫారం లు లభిస్తాయని ఆయన అన్నారు. 40వ డివిజన్ లోని 176, 177, 178, 179, 181, 182, 183, 198వ బూత్ లలో 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి వెళ్లి వారి పనితీరును పరిశీలించారు. అర్హులైన వారందరూ ఓటు హక్కును పొందాలని కార్పొరేటర్ మరుపల్ల రవి కోరారు. ఈ పరిశీలనలో సూపర్వైజర్ ఎన్.రమేష్, బీఎల్వోలు బత్తిని సునీత, గంద్రాతి మనిమల, అన్న దమయంతి, పూల రమాదేవి, బిస్కిల్ల పద్మ, సుధారాణి, బి.సుజాత, జి.సులోచన లు ఉన్నారు.

## చిన్నారులకు ఉచిత టీకాలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్‌లోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో ఉచితంగా చిన్నపిల్లలకు ఉచితంగా టీకాలు వేస్తున్నట్లు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల సూపరింటెండెంట్ కొర్వి జగన్‌మోహనాచారి పేర్కొన్నారు. శనివారం ఈ కార్యక్రమాన్ని ఆయుర్వేద వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అశోక్‌కుమార్‌తో పాటు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ నెల మూడో శనివారం ఈ ఆస్పత్రిలో సంబంధిత సిబ్బంది అందుబాటులో ఉండనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యు లు, సిబ్బంది ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## అభాగ్యులకు చద్దర్ల పంపిణీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రామన్నపేట లోని డాక్టర్ ఎ రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం వివిధ దేవాలయాల ముందు బిక్షమెత్తుకుంటూ జీవనం సాగిస్తున్న అభాగ్యులకు, అనాథలకు ట్రస్ట్ ద్వారా 30మంది కి చద్దర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేనేజింగ్ ట్రస్టీ మాట్లాడుతూ బిక్షగాళ్లు, అనాథలను, అభాగ్యులను చేరదీసి వారికి ఉండడానికి వసతి కల్పిస్తూ ఆహార సదుపాయాలు కల్పించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ తో పాటు తూర్పునూరు అశోక్, ప్రభ, సుమ, తదితర సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన కరీంనగర్ చెందిన ఎల్లంకి వెంకటేశంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# కేంద్ర ప్రభుత్వ మత రాజకీయాలను తిప్పికొట్టాలి

### ఫిబ్రవరి 16న అఖిల భారత సమ్మెను జయప్రదం చేయండి

### సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** సీఐటీయూసీ –వ్యవసాయ కార్మిక సంఘం రైతు సంఘం సంయుక్త సమావేశం సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి భూక్య సమ్మయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఈసంపెల్లి బాబుల అధ్యక్షతన వరంగల్ ఉర్సుగుట్ట సీఐటీయూ కార్యాలయంలో జరిగింది. రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక , రైతు , ప్రజా వ్యతిరేక విధానాలు, కార్పొరేట్ , మతోన్మాద , నయా ఉదారవాద విధానాల వలన ప్రజలు, కార్మిక వర్గం రైతాంగం పేద ప్రజల నుంచి వచ్చే వ్యతిరేకతను గుర్తించి రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో గెలుపు కోసం బీజేపీ మత రాజకీయాలకు తెరలేపిం అయోధ్య రామ మందిరాన్ని ముందుకు తీసుకువచ్చిందన్నారు. ఇంకా పూర్తిగా నిర్మాణం కానీ అయోధ్య రామ మందిరంలో విగ్రహ ప్రతిష్ట చేయడం సరికాదని, పెద్ద పెద్ద పీఠాధిపతులు సూచించిన కూడా పట్టించుకోకుండా పార్లమెంటు ఎన్నికల ముందే కార్యక్రమాన్ని తీసుకుందన్నారు. అక్షింతల పేరుతో ప్రతి ఇంటికి వెళుతూ ప్రజల ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలను పక్కదారి పట్టించే విధంగా ప్రజల్ని మతం మత్తులో ముంచుతుందని ఆరోపించారు. ఈ బీజేపీ చేస్తున్న మత రాజకీయాలను తిప్పి కొట్టడంలో భాగంగా దేశంలోని కార్మిక వర్గం,



రైతాంగం, ప్రజలందరినీ చైతన్యం చేయడం కోసం దేశంలోని అన్ని జాతీయ కార్మిక సంఘాలు, (రైతు సంఘాల ఐక్యవేదిక ) సంయుక్త కిసాన్ మోర్ , అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం, అఖిల భారత కిసాన్ సభలు సంయుక్తంగా ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా గ్రామీణ బంద్, పారిశ్రామిక బంద్ కు పిలుపునివ్వడం జరిగిందన్నారు. ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో భాగంగా జిల్లాలో జరిగే పారిశ్రామిక , గ్రామీణ బంద్ విజయవంతానికి సీఐటీయూ వ్యవసాయ కార్మిక సంఘం రైతు సంఘం సమావేశాలు నిర్వహించి వరంగల్ జిల్లావ్యాప్తంగా సమ్మె ప్రచార క్యాంపెయిన్ చేపట్టి, ఫిబ్రవరి 16న గ్రామీణ బందును జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు ఇనుముల శ్రీనివాస్, సింగారపు బాబు, తుమ్మల సాంబయ్య, బ్రహ్మాచారి, నాగపూర్ వెంకన్న, ప్రభాకర్, ఆశా వర్కర్స్ నాయకులు రాణి, వజ్ర, వ్యవసాయ కార్మిక సంఘం రైతు సంఘం, నాయకులు పాల్గొన్నారు.

# రీసైక్లింగ్ ప్రక్రియతో పర్యావరణానికి మేలు

### రికార్డ్ సర్వీసెస్ సొసైటీ అధ్యక్షుడు కుసుమ సురేష్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వాడిన వస్తువులను రీసైక్లింగ్ విధానం ద్వారా ఇతర వివిధ రకాల వస్తువులను తయారు చేయడం వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందని రికార్డ్ సర్వీసెస్ సొసైటీ అధ్యక్షుడు కుసుమ సురేష్ అన్నారు. కుమార్ పల్లిలోని స్మైలీ డిజి స్కూల్ లో విద్యార్థులకు పర్యావరణ పట్ల అవగాహన కల్పించడానికి ఐటీసీ వారి భాగస్వామ్యంతో తమ స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న కార్యక్రమాలలో భాగంగా ఈరోజు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఐటీసీ నిర్వహిస్తున్న ఇంటర్ క్లాస్ రీసైక్లింగ్ ఛాంపియన్షిప్ గోడపత్రికను ఆవిష్కరించి వివరాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు బాల్యం నుంచే పర్యావరణం పట్ల అవగాహన కలిగి ప్రకృతిని రక్షించాలని, విరివిగా చెట్లను పెంచాలని పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్ అన్నారు. రికార్డ్ సర్వీసెస్ సొసైటీ సెంట్రల్ కోఆర్డినేటర్ కుసుమ కవిత మాట్లాడుతూ ఇంట్లో ఉన్న వ్యర్థ పదార్థాలను విద్యార్థులు సేకరించి ఐటీసీ సంస్థకు అప్పగించినట్లయితే



ప్రశంసా పత్రంతో పాటు వాటి విలువకు సమానమైన ఐటీసీ ఉత్పత్తులను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి పర్యావరణాన్ని రక్షించడానికి ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా విద్యార్థులను ప్రోత్సహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ త్రివేణి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్త కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని చౌటపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ రజబోయిన శ్రీనివాస్ కుటుంబాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస నాయక్ శనివారం పరామర్శించారు. గత ఐదు రోజుల క్రితం శ్రీనివాస్ తండ్రి అనారోగ్యంతో మృతి చెందగా విషయాన్ని తెలుసుకుని వారి స్వగ్రామానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు అనిల్ రావు, చౌటపల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు గడ్డం జనార్ధన్, అట్టియతండా అధ్యక్షుడు లచ్చు నాయక్, సీనియర్ నాయకులు కుమార్ రావు వెంకటేశ్వరరావు, మండల సీసీఎల్ నాయకులు సదయ్య, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు భాస్కర్ నాయక్, మండల ఎస్సీ సెల్ నాయకులు జిల్లా కనకయ్య, మండల నాయకుడు, ఉద్యమకారుడు చల్ల వెంకన్న, గడ్డం కుమార్, సన్నీ, బూత్ కన్వీనర్ శ్రీనగర్ వెంకన్న, వెంకటేశ్వరరావు, తదితర చౌటపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రైవేటు ట్రాన్స్ పోర్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### మంత్రి పొన్నంకు సీఐటీయూ నాయకుల వినతి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రైవేటు ట్రాన్స్ పోర్ట్ రంగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రవాణా శాఖ మంత్రి పోన్నం ప్రభాకర్ కు ప్రైవేటు ట్రాన్స్ పోర్ట్ రంగం (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి బొల్లారం సంపత్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 25లక్షల మంది కార్మికులు రవాణా రంగం మీద ఆధారపడి స్వయం ఉపాధి పొందుతున్నారన్నారు. వీరిలో ఎక్కువ శాతం మంది చదువుకున్న యువకులు ఉద్యోగాలు లేకపోవడం వలన ప్రైవేటు ఫైనాన్స్ లోన్ తీసుకొని ఈ రంగంలోకి వస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం నుంచి వీరికి ఎలాంటి సంక్షేమ పథకాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ పోలీస్ రవాణా శాఖ అధికారులు విపరీతమైన పెనాల్టీలు విధించడం వలన కార్మికులపై విపరీతమైన భారం పడుతుందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో కార్మికులు తీవ్రంగా నష్టపోయారు. కాబట్టి కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ నేతలు విజ్ఞప్తి చేశారు. సీఐటీయూ నాయకులు పల్నాటి రమేష్, ఇమిడి సుధాకర్, దేవేందర్, ప్రభాకర్లు పాల్గొన్నారు.

# విద్యార్థులు జీవితాన్ని సవాల్‌గా తీసుకోవాలి



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** విద్యార్థులు జీవితాన్ని సవాలుగా తీసుకొని అంచలంచెలుగా ఉన్నత స్థాయికి వెళ్లాలని స్వామి రామానంద తీర్థ కన్న కలలను, రుజువు చేయాలని, అదేవిధంగా భారత మాజీ ప్రధాని పీవీ.నరసింహారావును ఆదర్శంగా తీసుకొని జీవితాన్ని సవాలుగా తీసుకొని ఆదర్శవంతంగా ఎదగాలని కేయూ వీసీ తాటికొండ రమేష్ అన్నారు. శనివారం మండలంలోని ముల్కనూర్ గ్రామంలో గల స్వామి రామానంద తీర్థ సహకార సహకార జూనియర్ కళాశాలలో 35వ వార్షికోత్సవ సమావేశము ప్రిన్సిపాల్ ఎద్దులాపురం మొగిలి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ ముఖ్యఅతిథిగా వచ్చి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ కళాశాల ప్రశాంత వాతావరణంలో, ఆహ్లాదకరమైన వాతావరణంలో, భారత మాజీ ప్రధాని పీవీ. నరసింహారావు కూతురు సురభి వాణిదేవి నిర్వహిస్తున్న కళాశాలలో మీరు విద్యను అభ్యసించడం విద్యార్థులు అదృష్టంగా భావించాలని వారు అన్నారు. నేడు విద్యాసంస్థల్లో అమ్మాయిల సంఖ్యనే అధికంగా ఉంటుందని వారు గుర్తు చేశారు. విద్య ద్వారానే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని సూచించారు. ఉపాధ్యాయులకు సన్నిహితంగా ఉండి అన్ని రకాల సమస్యలను పరిష్కరించుకొని దృఢ సంకల్పంతో ముందుకు వెళ్లాలని వారు సూచించారు. అమ్మాయిలు విద్యావంతులు అయితే మెరుగైన సమాజం ఏర్పడుతుందని గుర్తు చేశారు. అనంతరం సురభి ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ సురభి వానిదేవి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ ప్రాంతంలో పుట్టి పెరిగిన మాజీ ప్రధాని పీవీ.నరసింహారావు విద్య వల్లనే ఈ దేశానికి ప్రధానమంత్రి అయ్యాడని గుర్తు చేశారు. తన తండ్రి బాటలోనే నేను నడుస్తున్నానని ఆమె చెప్పారు. తన స్వగ్రామంలో ఉన్న 800 ఎకరాల భూమిని దానం చేసి తన దాతృత్వ స్వభావాన్ని చాటుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీ.ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ తిరుమలా ఋషి, చార్టెడ్ అకౌంటెంట్ హుస్సేన్ భాష, డాక్టర్ యదలాపురం తిరుపతి, పిడిశెట్టి రాజు, అధ్యాపక బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థులు ఆలపించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

## ఓటరు నమోదుకు ప్రత్యేక కార్యక్రమం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని 20వ డివిజన్ లోని నరేందర్ నగర్ హైస్కూల్ లో నిర్వహిస్తున్న ఓటర్ నమోదు ప్రత్యేక కార్యక్రమంలో వరంగల్ తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18సంవత్సరాలు నిండిన ప్రతి ఓటరు ఈ ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమంలో అప్లై చేసుకోవచ్చని వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు పలు సూచనలను సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ రెవిన్యూ ఇన్ స్పెక్టర్ జలపతి రెడ్డి, రెవెన్యూ సిబ్బంది గద్దల రాజు, ఆర్పీలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పురుషులతో సమానంగా మహిళలను గౌరవించాలి



**వరంగల్ వాయిస్, శాయంపేట :** నేటి సమాజంలో పురుషులతో సమానంగా మహిళలను గౌరవించాలని జిల్లా మహిళా సాధికారత సంస్థ స్పెషలిస్ట్ లావణ్య అన్నారు. మండల కేంద్రంలోని జీపీ కార్యాలయ ఆవరణలో శనివారం జిల్లా మహిళా సాధికారత కేంద్రం హనుమకొండ వారు బేటి బచావో బేటి పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లావణ్య మాట్లాడుతూ కుటీర పరిశ్రమల పై ఆసక్తి ఉన్నవారు గ్రామాలలో 20మందికి ఒక గ్రూపుగా ఏర్పడి తే వారికి ఉచితంగా శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్ అందజేస్తామని దీంతో ఏదో కంపెనీలో ఉద్యోగం కూడా లభిస్తుందన్నారు. అదేవిధంగా పిల్లల హక్కులు, విద్యా ప్రాముఖ్యతపై ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రంజిత్ కుమార్ గౌడ్, సర్పంచ్ కందగట్ల రవి, పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మానవ అక్రమరవాణాను అరికట్టాలి




**వరంగల్ వాయిస్, మరిపెడ :** మానవ అక్రమ రవాణాను అరికట్టాలని ఎఫ్ఎంఎం సోషల్ సర్వీస్ సొసైటీ మండల ఫీల్డ్ కోఆర్డినేటర్ నిరుడు శిరీష అన్నారు. శనివారం మండలంలోని అబ్బాయి పాలెం గ్రామంలో మానవ అక్రమ రవాణాపై అవగాహన సదస్సు ఝాన్సీ లక్ష్మీబాయి గ్రామైక్య సంఘం సీపే తీగల లలిత అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి నిరుడు శిరీష పాల్గొని మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయకూడదని, చట్టరీత్యా నేరమని మహిళలకు సూచించారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులను హింసలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. వేధింపులు జరిగినప్పుడు క్రైమ్ బ్రాంచ్ కు ఫిర్యాదు చేయాలన్నారు. అపరిచిత వ్యక్తుల ప్రవర్తన పట్ల ఏమాత్రం అనుమానం ఉన్న ఫిర్యాదు చేయాలన్నారు. టోల్ ఫ్రీ నెంబర్ 100,1098,1930, మహిళా రక్షణ కోసం సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు జిన్నా లచ్చన్న, గ్రామ వార్డు సభ్యురాలు ఎస్ కె చాందిని, మహిళా సంఘం నాయకురాలు పోలేపొంగు నాగమణి, తీగల ఏకమ్మ, జనక వెంకటమ్మ, శ్రీదేవి, లక్ష్మి, మంజుల, భద్రమ్మ, తీగల పూలమ్మ, జినక చంద్రమ్మ, గొంగడి నాగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## బాలికల సాధికారతపై అవగాహన సదస్సు




**వరంగల్ వాయిస్, కాటారం :** బాలికల సాధికారతపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆయా కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలను చేపట్టింది. ఇందులో భాగంగా శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా సంక్షేమ అధికారి ఆదేశాల మేరకు బాలికల జాతీయ దినోత్సవం సందర్భంగా కాటారం మండలం కాటారం, దామరకుంట గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. భేటీ బచావో , బేటి పడావో అనే నినాదాలతో బాలికల చేత ప్రతిజ్ఞ చేయించారు. బాలికలపై జరుగుతున్న అరాచకాలను నివారించుకునేందుకు ప్రభుత్వం కల్పించిన టోల్ ఫ్రీ నెంబర్ 1098, అలాగే మహిళలపై జరుగుతున్న అకృత్యాల నివారణకు 181టోల్ ఫ్రీ నెంబర్లను ఉపయోగించుకోవాలని వారు వివరించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మిషన్ కోఆర్డినేటర్ అనూష, సీహెచ్ఎల్ జిల్లా కోఆర్డినేటర్ తిరుపతి, డీసీపీయూ కౌన్సిలర్ శైలజ, కళావతి, మమత, సురేష్ , పాఠశాలల ప్రిన్సిపాల్ శైలజ, అనురాధ, మమత, ఉపాధ్యాయినీలు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, శాయంపేట :** ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన జీవనజ్యోతి పరస్పర సహాయ సహకార సంఘం పత్తిపాక సభ్యుడు ఎల్తూరి పవన్, పోతుగంటి వెంకటేశ్వర్లు కుమారుడు పొతుగంటి వంశీకి సంఘం ఆర్థిక సహాయం అందజేసింది. సంఘ సభ్యుడైన పవన్ కు రూ. 43000,సభ్యుడైన పోతుగంటి వెంకటేష్ కుమారుడైన వంశీకి రూ. 17000 వారి కుటుంబానికి అందజేశారు.

# డిటెక్షన్ విధానాన్ని ఎత్తివేయాలి

## విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వీసీ బిల్డింగ్ ముట్టడి



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఫార్మసి విభాగంలో ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రూల్ ప్రకారం డిటెక్షన్ విధానాన్ని ఎత్తివేసి విద్యార్థులకు సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించాలని బహుజన విద్యార్థి సంఘం(బీఎస్ఎఫ్) భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) విధ్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వైస్ ఛాన్సలర్ భవనం ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. ఈ సందర్భంగా బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ కేయూ ఇంచార్జి, హనుమకొండ జిల్లా అధ్యక్షులు బొట్ల మనోహర్ మాట్లాడుతూ ఫార్మసీ విభాగంలో ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(పీసీఐ) నియమాల ప్రకారం సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించక పోవడం మూలంగా విద్యార్థులు తీవ్రంగా నష్టపోయి మనోవేదనకు గురవుతున్నారని, ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నియమాలను తుంగలో తొక్కి కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఫార్మసి కళాశాల నడుపుతున్నారని ఆరోపించారు. వెంటనే డిటెక్షన్ విధానాన్ని ఎత్తివేసి సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్, ఎస్ఎస్ యూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎల్తురు సాయి కుమార్, ఏబీఎస్ఎఫ్ యూనివర్సిటీ అధ్యక్షుడు మచ్చ పవన్ కళ్యాణ్, విద్యార్థులు మదర్, సాయి, శివ కుమార్, కిరణ్, స్వప్న, సృజన, అనూష వందలాది విద్యార్థులు పాల్గొన్నారు.

## గంట రవికుమార్‌ను కలిసిన బీజేపీ నేతలు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ బీజేపీ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన గంటా రవికుమార్ ను శనివారం కాశిబుగ్గ 19వ డివిజన్ కు చెందిన బీజేపీ నాయకులు మర్యాదగాపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ కు శాలువా కప్పి, బొకే అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముచ్చర్ల ప్రభాకర చారి, పల్లకొండ కోటి, తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## వరంగల్ ఎంపీ బరిలో తొర్రూరు జడ్పీటీసీ శ్రీనివాస్

**అభివృద్ధిలో తనదైన ముద్ర..**

**ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరు..**

**తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర**

**ఉద్యమ నేతగా ఉమ్మడి వరంగల్‌కు సుపరిచితం..**

**మచ్చలేని నాయకుడిగా గుర్తింపు..**

**పరిశీలనలో మంగళపల్లి పేరు..?**



\- గడ్డం కేశవమూర్తి



# గులాబీ సైనికుడు.. ప్రజాసేవకుడు.. మంగళపల్లి

ప్రజా సేవకుడు.. ప్రగతి శ్రామికుడు.. గులాబీ సైనికుడు.. ఉద్యమకారుడు.. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌కు విధేయుడు.. ప్రజలే ఆయన శ్వాస.. ప్రజా సమస్యలపైనే ధ్యాస.. అభివృద్ధిలో తనదైన ముద్రవేస్తూ ప్రజలకు, ప్రతి ఇంటికి చేరువయ్యారు తొర్రూరు జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్.. పట్టుదలే పెట్టుబడిగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఎన్నో నిర్బంధాలు ఎదుర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ తొలినాళ్లలో కేసులతో ఇబ్బందులకు గురి చేసినా గులాబీ జెండాను వీడలేదు. జై తెలంగాణ నినాదంతో ప్రజల్లోకి వెళ్లి వారిని చైతన్యం చేశారు. ఒకవైపు నిర్బంధాలు.. మరోవైపు కేసులు పెట్టినా.. నమ్మిన సిద్ధాంతం కోసం ముందుకు కదిలారు. విప్లవ, సామాజిక, తెలంగాణ ఉద్యమాల్లో జంగ్ సైరన్ మోగించి జన హృదయనేతగా నిలిచారు. ఆయనే తొర్రూరు జడ్పీటీసీ, జడ్పీ ఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్.. ఇప్పుడు ఆయన వరంగల్ పార్లమెంట్ బరిలో నిలవబోతున్నారు. తెలంగాణ ఉద్యమకారుడిగా, పార్టీ విధేయుడిగా ఆయన ప్రత్యేక గుర్తింపు ఉంది. మచ్చలేని నాయకుడిగా అధిష్ఠానం వద్ద పేరుంది. యువకుడు, ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుక కావడం.. ప్రత్యర్థుల వ్యూహాలను సైతం తిప్పిగొట్టగల సామర్థ్యం ఉండటంతో ఆయన పేరు అధిష్ఠానం పరిశీలిస్తోందని తెలుస్తోంది.



### సేవా దీప్తి.. యువతకు స్ఫూర్తి..

తొర్రూరు పట్టణానికి చెందిన చం ద్రయ్య, సమ్మక్క దంపతుల కుమారుడు శ్రీనివాస్. 1988లో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేశారు. ఇంటర్ 1990లో చదివారు. వరంగల్ లో డిగ్రీ పూర్తి చేశారు. ఈ క్రమంలో ఆయన సామాజిక సమస్యలపై గళం వినిపించారు. పేద కుటుంబం నుంచి వచ్చిన ఆయనకు పేదల కష్టాలు తెలుసు.. అందుకే ప్రజాసేవకే జీవితం అంకితం చేయాలని నిశ్చయించుకున్నారు. ఇందుకోసం సేవా సంస్థలో చేరి అనేక సేవా కార్యక్రమాలు చేశారు. యువత, మహిళ సాధికారత, దళితుల సమస్యలు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై, రైతుల ఆత్మహ త్యల నివారణ కోసం అలుపెరుగని కృషి చేశారు. ఎయిడ్స్, టీబీ, కుష్టు వ్యాధుల నిర్మూలన, నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రగతి సేవా సంస్థలో పనిచేసిన ఆయన చివరికి ఆ సంస్థ పేరుని తన ఇంటి పేరుగా మార్చుకున్నారంటే ఆయన నిబద్ధత ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. తొర్రూరుతో పాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల వారు సైతం.. ప్రగతి శ్రీనుగా ఆప్యాయంగా పిలుచుకుంటారు. "అన్న అంటే నేనున్నా'.. అలాంటి వ్యక్తిత్వం ఆయన సొంతం.. యువతకు కెరీర్ గైడెన్స్ ఇవ్వడంలో ఎప్పుడు ముందుంటారు. చదువు, ఆట, పాటలు, ఇటు రాజకీయ, అటు సేవా రంగంలో యువతను ప్రోత్సహిస్తూ వస్తున్నారు. తనకు తోచిన సాయం చేస్తూ యువతకు వెన్నుదన్నుగా ఉంటూ సేవా దీప్తి.. యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

### గులాబి దళంలో.. "ప్రగతి గళం'

గులాబీ దళంలో ప్రగతి గళం వినిపించిన నేత మంగళపల్లి శ్రీనివాస్.. 2001లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు తెలంగాణ ఉద్యమంలో క్రియా శీలక పాత్ర పోషించారు. నాటి టీఆర్ఎస్ ప్రస్తుత బీఆర్ఎస్ లో ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన పోరాటంలో తనదైన ముద్రవేసి అధినేత మన్ననలు పొందారు. 2009 నుంచి 2014 వరకు తెలంగాణ జేఏసీ కన్వీనర్ గా వ్యవహరించారు. మంగళపల్లి ఆధ్వర్యంలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం చేపట్టిన ఎన్నో కార్యక్రమాలు విజయవంతమయ్యాయి. ధర్నాలు రాస్తారోకోలు, ధూమ్ ధాం కార్యక్రమాలతో ప్రజల్లో ప్రత్యేక రాష్ట్ర కాంక్షను చాటారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం తొర్రూరును రెవెన్యూ డివిజన్ గా ప్రకటించాలని చేపట్టిన జేఏసీ ఉద్యమంలో శ్రీనివాస్ కీలకంగా వ్యవహరించారు. ఎట్టకేలకు రెవెన్యూ డివిజన్ సాధించి ప్రజల కల సాకారం చేశారు. అనంతరం బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శిగా పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా పనిచేశారు. మంగళపల్లి శ్రీనివాస్ కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసానికి ముగ్ధుడైన ఎర్రబెల్లి దయాకర్ రావు 2019లో బీఆర్ఎస్ తొర్రూరు జడ్పీటీసీ అభ్యర్థిగా అవకాశం కల్పించారు. ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఈ ఎన్నికలో భారీ మెజారిటీ సాధించారు. నిత్యం ప్రజల్లో ఉంటూ.. ప్రజా సేవే పరమావధిగా ముందుకు సాగుతున్నారు. జిల్లా పరిషత్ సమావేశాల్లో మండల సమస్యలపై తన గళం వినిపించారు. ఆయన వాగ్ధాటికి మెచ్చి జడ్పీ ఫ్లోర్ లీడర్ గా ఎంపిక చేశారు. జిల్లాలోని 16మండలాల్లో ఉత్తమ జడ్పీటీసీగా గుర్తింపు పొందారు. ప్రతిపక్షాల విమర్శలకు దీటుగా, ఘాటుగా సమాధానాలు ఇస్తూ వారి డొల్లతనాన్ని ప్రజలకు వివరిస్తారు.

### పార్లమెంట్ బరిపైనే ఆయన గురి..

దళిత సామాజిక ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించిన మంగళపల్లి.. ప్రస్తుతం వరంగల్ పార్లమెంట్ బరిలో నిలిచేందుకు కసరత్తు మొదలు పెట్టారు. ఆది నుంచి బీఆర్ఎస్ పార్టీలో మచ్చలేని నాయకుడిగా గుర్తింపు పొందారు. పత్యేక రాష్ట్ర సాధనంలో ఉద్యమం గొంతుకై నిలిచారు. అనేక గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాల ఏర్పాటుకు కృషి చేశారు. దళితుల హక్కుల కోసం పోరాడారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులందరికీ చేరువయ్యేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగారు. దళిత, గిరిజనుల అభ్యున్నతికి కృషి చేశారు. నిరంతరం ప్రజల కోసం, పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమిస్తున్న మంగళపల్లికి వరంగల్ పార్లమెంట్ బరిలో దిగాలని కృతనిశ్చయంతో ఉన్నారు. ఈ మేరకు పార్టీ అధిష్ఠానం కూడా పేరును పరిశీలిస్తున్నట్లుగా సమాచారం ఉంది.

### ఆర్థిక బలం లేకున్నా.. జనం బలం ఉంది..

నేటి సమకాలీన రాజకీయాలపై డబ్బు ప్రభావం ఉంది. ఇలాంటి పరిస్థితులను సైతం ఆయన ఎదుర్కొవడానికి పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ఆర్థిక బలం లేకపోయినా.. జనం బలం ఉందని, ప్రజలే తన బలం.. బలగం.. తన గళమని మంగళపల్లి శ్రీనివాస్ చెబుతున్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తనపై నమ్మకం ఉంచి వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. గతంలో పార్టీ ఏ టాస్క్ ఇచ్చినా విజయవంతంగా పూర్తి చేశానని, పార్టీ విధేయుడిగా ఉన్నానని పేర్కొన్నారు.













# ఒక్క గజం ప్రభుత్వ భూమిని వదలం

## జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రభుత్వ భూమిని ఒక్క గజం కూడా వదలమని, ఎవరు ఆక్రమించినా వెనక్కి తీసుకుంటామని జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. శనివారం హనుమకొండ కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో ఉమ్మడి వరంగల్ జిల్లా (హనుమకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి )పరిధిలోని 12 నియోజకవర్గాల అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షా సమావేశాన్ని శనివారం నిర్వహించారు. వరంగల్ ఉమ్మడి జిల్లా అభివృద్ధి కార్యక్రమాల సమీక్ష సమావేశానికి రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై నీటిపారుదల శాఖ, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, కుడా, జీడబ్ల్యు ఎంసీ, నేషనల్ హైవేస్, ఐటీడీఏ, హౌసింగ్, పోలీస్, ఫారెస్ట్, దేవాదాయ శాఖల పనితీరు, చేపట్టిన, చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలపై ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చేపట్టిన ప్రాజెక్టులతోపాటు గత ప్రభుత్వ హామీలు వాటి స్టేటస్ పై అధికారులతో సమీక్షించామన్నారు. ఇరిగేషన్ పై ప్రధానంగా దృష్టి సారించామని వెల్లడించారు. డబుల్ బెడ్రూం స్కీమ్ సంబంధించి భారీగా బిల్స్ పెండింగ్ ఉన్నాయన్నారు. అదే విధంగా మిషన్ భగీరథ, ఇరిగేషన్ ప్రాజెక్టులను ఎలా పూర్తి చేయాలో అధికారులతో చర్చించామన్నారు. ప్రజలకు ఏం కావాలో తెలుసుకోవడానికే ప్రజాపాలన పేరిట దరఖాస్తులు తీసుకున్నామన్నారు. వాటి ఆధారంగానే సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. స్వంత లాభం కోసం గత ప్రభుత్వం చేపట్టిన పనుల కొనసాగింపుపై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. రానున్న బడ్జెట్ లో వరంగల్ జిల్లాకి ఏం కావాలో ఈ సమీక్ష ద్వారా తేటతెల్ల కానుందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలకు ఏంకావాలో వాటి సాధన కోసమే ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

### మేడారం జాతరకు రూ.110 కోట్లు..

గతంలో ఎన్నడూ లేని విధంగా మేడారం జాతరకు ప్రభుత్వం రూ.110 కోట్లు కేటాయించిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇందులో ఇప్పటికే రూ.75 కోట్లను విడుదల చేశామన్నారు. మరో రూ.35 కోట్ల నిధులను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. వీటితో మేడారం జాతరలో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. అమ్మల దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

### త్వరలో కాళోజీ క్షేత్రం పూర్తి..

గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో పదేళ్ళయినా కాళోజీ కళా క్షేత్రాన్ని పూర్తి చేయలేకపోయిందని మంత్రి పొంగులేటి ఆరోపించారు. మేము సాధ్యమైనంత త్వరలో పనులు పూర్తి చేసి కాళోజీ క్షేత్రాన్ని ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. అదే విధంగా అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్రూం ఇండ్లను పూర్తి చేసి పేద ప్రజలకు అందజేస్తామన్నారు. గత ప్రభుత్వంలో జీవో నెంబర్ 59 ద్వారా ఆక్రమించుకున్న భూములను వెనక్కి తీసుకొని పేదలకు పంచుతామన్నారు.

### ప్రజలకోసం పనిచేస్తాం..: మంత్రి కొండా సురేఖ

ప్రజలకోసం పనిచేస్తేనే పరిపాలనకు అర్థం ఉంటుందని జిల్లా మంత్రి కొండా సురేఖ అభిప్రాయ పడ్డారు. ప్రజల సమస్యలు తెలుసుకొని తీర్చడమే కాంగ్రెస్ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వంలో నియోజకవర్గాల్లో వందల కోట్ల పనులకు శంకుస్థాపనలు చేశారని, వాటికి నిధులు సమకూర్చడం భారంగా మారుతోందన్నారు. ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలు చేస్తామని ప్రకటించారు. అధికారులు సైతం ప్రజలకోసం పనిచేయాలన్నారు. ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో అధికారులు రాజీ పడొద్దని సూచించారు.

### అధిక నిధులు కేటాయించండి..: మంత్రి సీతక్క

ములుగు జిల్లా అభివృద్ధికి అధికంగా నిధులు మంజూరు చేయాలని మంత్రి సీతక్క కోరారు. జిల్లాలో గోదావరి బెల్టుతో పాటు చిన్న చిన్న వాగులు, పెద్ద పెద్ద చెరువులు చాలా ఉన్నాయని, వాటిని రామప్ప, లక్నవరం సరస్సులను అనుసంధానం చేయడం ద్వారా శాశ్వత గ్రావిటీ కాలువలు నిర్మాణం కోసం ల్యాండ్ అక్విజిషన్ జరిగిందన్నారు. పెండింగ్ లో ఉన్న ల్యాండ్ యాక్విజిషన్ కు డబ్బులు అందించాలన్నారు. రాబోయే వేసవి కాలంలో తాగు, సాగు నీటికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. మేడారం జాతర, పర్యాటక కేంద్రాలు జిల్లాలో ఉన్నందున వచ్చే బడ్జెట్ లో ములుగు జిల్లాకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.



### అభివృద్ధే ధ్యేయంగా ప్రజా పాలన..: మంత్రి పొన్నం ప్రభాకర్



ఈ సమావేశంలో రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అభివృద్దే ధ్యేయంగా ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉమ్మడి కరీంనగర్ పరిధిలో ఉన్న మూడు మండలాలు హనుమకొండ జిల్లా పరిధిలోనికి వచ్చాయని అన్నారు. వాటికి అభివృద్ధికి అధికారులు ప్రణాళికతో ఉండాలన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ జాటోత్ రామచంద్రనాయక్, హుజురాబాద్, జనగాం, పాలకుర్తి, మహబూబాబాద్, నర్సంపేట, వరంగల్ పశ్చిమ, పరకాల, వర్ధన్నపేట, జయశంకర్ భూపాలపల్లి ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, మామిడాల యశస్విని రెడ్డి, డాక్టర్ మురళి నాయక్, దొంతి మాధవరెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, కె.ఆర్. నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, హనుమకొండ, వరంగల్, జనగామ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, శివలింగయ్య, ఇలా త్రిపాఠి, భవేష్ మిశ్రా, అద్వైత్ కుమార్ సింగ్, జి డబ్ల్యు ఎం సి కమిషనర్ రిజ్వాన్ భాషా షేక్, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ అంకిత్, ములుగు, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల ఎస్పీలు శబరీష్, డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్, కిరణ్ కారే, అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, మహేందర్ జి, ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ట్రైనీ ఐపీఎస్ శుభం నాగరాలే, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.







# బొడ్రాయి స్థాపనతో ఐక్యతను చాటుదాం

**వరంగల్ వాయిస్, రంగశాయిపేట :** బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించి రంగశాయిపేట ఐక్యతను చాటుదామని 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందన, ఉత్సవ కన్వీనర్లు కొల్లూరి యోగానంద్, కేడల జనార్ధన్, గుండు పూర్ణచందర్ లు అన్నారు. రంగశాయిపేట బొడ్రాయి ప్రతిష్ఠాపనలో భాగంగా రంగశాయిపేట యూత్ ఫోర్స్ ఆర్ వై ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం రంగశాయిపేటలోని కాంక్ష ఫంక్షన్ హాల్ లో బొడ్రాయి ప్రతిష్టాపనపై ముఖ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో భాగంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన నిర్వహణకు తగిన ప్రణాళికలు రూపొందించారు. ఉత్సవాల నిర్వహణకు ముఖ్య మైన కమిటీలను, బాధ్యులను నియమించారు. బొడ్రాయి ప్రతిష్టాపన కార్య నిర్వహణ కమిటీ కన్వీనర్ గా కొల్లూరి యోగానంద్, పర్యవేక్షణ కమిటీ కన్వీనర్ గా కేడల జనార్దన్, సమన్వయ కమిటీ కన్వీనర్ గా గుండు పూర్ణచందర్ లను ఎన్నుకున్నారు. కోశాధికారులతో పాటు ముఖ్య సలహాదారులను, కమిటీ బాధ్యులను ఎన్నుకొనున్నట్లు పేర్కొన్నారు. పలు కమిటీలను గుర్తించి ఆ కమిటీలు నిర్వర్తించాల్సిన బాధ్యతలను తెలిపారు. ఆర్ వై ఎఫ్ చేపట్టిన బొడ్రాయి ప్రతిష్ఠాపనకు గ్రామ ప్రజలంతా సహకరించి విజయవంతం చేసుకుందామని గ్రామ పెద్దలు తెలిపారు. ఆసక్తి ఉన్న అందరిని బాధ్యులుగా తీసుకొని పెద్దల సలహాలు, సూచనలు తీసుకుంటూ ఉత్సవాలను నిర్వహిస్తామని ఈ సందర్బంగా ఆర్ వైఎఫ్ బాధ్యులు తెలిపారు. త్వరలోనే కార్యక్రమ వివరాలను తెలుపుతూ కరపత్రాలు అందిస్తామన్నారు. అనంతరం ఉత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు, మహిళలు, ఆర్ వై ఎఫ్ సభ్యులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# క్యాలెండర్ ఆవిష్కరించిన ప్రెస్ క్లబ్ కమిటీ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** విజన్ ఆంధ్ర తెలుగు దిన పత్రిక నూతన సంవత్సర క్యాలెండర్ ను శనివారం గ్రేటర్ వరంగల్ ప్రెస్స్ క్లబ్ కార్యాలయంలో ప్రెస్ క్లబ్ కమిటీ ఆవిష్కరించింది. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రెస్ క్లబ్ కార్యదర్శి బి.సదయ్య, కోశాధికారి బోల్ల అమర్, ఉపాధ్యక్షులు కె.దుర్గాప్రసాద్ రావు, యాంసాని శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ సంపేట సుధాకర్, కార్యవర్గ సభ్యులు గుండె దిలీప్, ఎండీ నయీంతో పాటు చిన్న పత్రికల అధ్యక్షుడు ఎ.శ్రీనివాస్, మాజీ ప్రెస్స్ క్లబ్ అధ్యక్షుడు గడ్డం కేశవ మూర్తి, కంకనాల సంతోష్, హనుమకొండ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ శనిగరపు శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com